బీసీ కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలి

కాచిగూడ,డిసెంబర్ 17: బీసీ కులాల సమగ్రాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్లను ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ కోరారు. మంగళవారం నింబోలిఅడ్డా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. బీసీ కార్పొరేషన్లకు పాలక మండళ్లను నియమించి జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బీసీ కులాల ఫెడరేషన్ల నియమ, నిబంధనలను మార్చాలని పేర్కొన్నారు. బీసీ కార్పొరేషన్ పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించి, సబ్సిడీ రుణాలకు నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు.

నేడు అయ్యప్పస్వామి మహాపడిపూజ

అంబర్‌పేట, డిసెంబర్ 17 : శ్రీహరిహరపుత్ర అయ్యప్ప స్వామి మహా పడిపూజను ఈ నెల 18వ తేదీ బుధవారం సాయంత్రం నల్లకుంటలోని స్ట్రీట్ నంబర్-8, ఎస్బీఐ బ్యాంక్ లేన్, న్యూ నల్లకుంటలో నిర్వహిస్తున్నట్లు గురుస్వామి దూసరి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. సాయంత్రం ఆరు గంటల నుంచి పడిపూజ మొదలవుతుందన్నారు. ఆచార్య ఆత్రేయ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం జరుగుతుందని, జడల రమేశ్ సిరిసిల్ల చే భజన ఉంటుందని చెప్పారు. అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

శ్రీరామ పాదుకల పల్లకి యాత్ర ప్రారంభం

భాగ్యనగరం నుంచి అయోధ్య వరకు నిర్వహించనున్న శ్రీరామ స్వర్ణ పాదుకల పల్లకి పాదయాత్రను మంగళవారం లంగర్‌హౌస్ సంగం రాంలీలా మైదానంలో సంగం మఠాధిపతి రాహుల్ దాస్ బాబా, రామరాజ్యం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు సంగి దేవేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లంగర్‌హౌస్ ప్రాంత నాయకులు పాల్గొని పాదుకలకు పూజ చేశారు.

– మెహిదీపట్నం, డిసెంబర్ 17

కాడిగె పాండయ్య సంస్మరణ సభ

కార్వాన్ పద్మశాలి సంఘం వ్యవస్థాపకుడు కాడిగె పాండయ్య సంస్మరణ సభను మంగళవారం నిర్వహించారు. ఈ సభలో పద్మశాలి సంఘం నాయకులు అంబటి శ్రీనివాస్, హన్మంతు, సంతోష్ తదితరులు. – కార్వాన్, డిసెంబర్17

అన్నం పెట్టే రైతన్నకు సంకెళ్లు వేస్తారా?

- కాంగ్రెస్ ప్రభుత్వ రాక్షస పాలనకు ఇది నిదర్శనం
- అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేసిన బీఆర్ఎస్ నాయకులు

లగచర్ల రైతులపై అక్రమ కేసులు బనాయించడాన్ని నిరసిస్తూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించిన కార్వాన్ బీఆర్ఎస్ నాయకులు ఠాకూర్ జీవన్ సింగ్, శ్రీధర్ సాగర్ తదితరులు

అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాంపల్లి బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఆనంద్‌కుమార్‌గౌడ్

కార్వాన్, డిసెంబర్17 : ప్రజలకు అన్నం పెట్టే రైతన్న చేతికి సంకెళ్లు వేయడం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ రాక్షస పాలనకు నిదర్శనమని కార్వాన్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఠాకూర్ జీవన్ సింగ్ అన్నారు. లగచర్ల రైతు చేతికి సంకెళ్లు వేయడాన్ని నిరసిస్తూ కార్వాన్ బీఆర్ఎస్ అధ్వర్యంలో లక్ష్మీనగర్ చౌరస్తాలో ఉన్న డాక్టర్ బీఆర్. అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జీవన్ సింగ్ మాట్లాడుతూ.. లగచర్లలో రైతులను అక్రమ అరెస్టు చేయడమే కాకుండా వారిని జైల్లో పెట్టి హింసించడం ప్రభుత్వ అహంకారినికి నిదర్శనమన్నారు. జైల్లో ఉన్న రైతులను వెంటనే విడుదల చేసి వారి పై పెట్టిన కేసులను కొట్టివేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలను మాయమాటలతో మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ గత ఏడాది కాలంగా అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తూ నిరంకుశ పాలన సాగిస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రజలను హింసిస్తే వారిని రక్షించేందుకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ విధానాలు ఇలాగే కొనసాగితే ఆ పార్టీని ప్రజలే బొంద పెడతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీధర్ సాగర్, ముత్యాల భాస్కర్, వనం హరి, అంబటి శ్రీనివాస్, రఘు, బంటి యాదవ్, గంగాధర్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు బేడీలు వేయడం దారుణం

మెహిదీపట్నం : రైతులకు బేడీలు వేసి అక్రమంగా కేసులు బనాయించిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెబుతారని నాంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి సీహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం సూచన మేరకు నాంపల్లి నియోజకవర్గం నాయకులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అదే విధంగా కార్వాన్ నియోజకవర్గంలో నిర్వహించిన కార్యక్రమంలో లంగర్‌హౌస్, గోల్కొండ డివిజన్‌ల అధ్యక్షులు చంద్రకాంత్, జబ్బార్, నాయకులు రంగారెడ్డి, రాములు, పట్లూరి రఘు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనగర్ చౌరస్తాలో అంబేద్కర్‌విగ్రహానికి వినతి పత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు చంద్రకాంత్, జబ్బార్ తదితరులు

మా భూమి మాకు అప్పగించండి.. ప్రభుత్వానికి పెన్షనర్ల విజ్ఞప్తి

తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కనకం కొమురెల్లిని సత్కరిస్తున్న వక్తలు

రవీంద్రభారతి, డిసెంబర్ 17 : తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెన్షనర్స్ డే వేడుకలు మంగళవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కనకం కొమురెల్లి, జనరల్ సెక్రటరి తూము అశోక్‌రెడ్డి, అసోసియేషన్ ప్రెసిడెంట్ టీఎస్ ఆర్.గుప్తా, వేణుగోపాలస్వామి, జయంతి ప్రకాశ్‌రావు తదితరులు విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి పెన్సన్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కనకం కోమురెల్లి, జనరల్ సెక్రటరి తూము అశోక్‌రెడ్డి, టీఎస్ ఆర్. గుప్తా మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపన్నపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 36,37 లలో 1991లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మా సొసైటీకి కేటాయించిన 189.11 ఎకరాల భూమిని మాకు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. అప్పుడున్న ఏపీ ఎన్జీఎస్ (గచ్చిబౌళి) మ్యాక్స్ హౌసింగ్ సొసైటి ఇప్పుడు బీటీఎన్జీస్‌గా గచ్చిబౌలి మ్యాక్ హౌసింగ్ సొసైటీగా పేరు సవరించడం జరిగిందని అన్నారు. జీహెచ్ఎంసీ నిబంధనలకు అనుగుణంగా ప్లాట్లుగా చేసి , అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. ఇప్పుడు మేమందరం రిటైర్డ్ అయ్యామని, ప్రభుత్వం మానవతాదృక్పథంతో మాభూమి మాకు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీఓఎస్ జనరల్ సెక్రటరి ముజీబ్ హుస్సేన్, టీఎన్‌జీఓఎస్ గచ్చిబౌలి సొసైటీ అధ్యక్షుడు ముత్యాల సత్యనారాయణగౌడ్, రెడ్డి ఉమా రెడ్డి, మారం జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు విశ్వవిద్యాలయానికి కపిలవాయి లింగమూర్తి పేరు పెట్టాలి

- తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం విజ్ఞప్తి

కపిలవాయి లింగమూర్తి

రవీంద్రభారతి, డిసెంబర్ 17 : పాలమూరు జిల్లా విశ్వవిద్యాలయానికి ప్రముఖ సాహితీవేత్త కపిలవాయి లింగమూర్తి పేరు పెట్టాలని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. మంగళవారం బషీర్‌బాగ్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్‌మోహన్, గౌరవ అధ్యక్షుడు లాలుకోట వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి చొల్లెటి కృష్ణామాచార్యులు, టెజరరీ రాగిఘణి రవీంద్రచారి మాట్లాడుతూ.. పాలమూరు విశ్వవిద్యాలయానికి తెలంగాణ సాహిత్య పునరుజ్జీవనానికి జీవిత కాలం కృషిచేసిన గొప్ప రచయిత, టీటీడీతో పాటు అనేక విశ్వవిద్యాలయాల నుంచి ప్రశంసలు అవార్డులు, రివార్డులు పొందిన పాలమూరు జిల్లా ముద్దుబిడ్డ కపిలవాయి లింగమూర్తి పేరు పెట్టాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. వందల ఏండ్ల చరిత్రను తెలంగాణ జాతీకి అందించిన సాహితీ శిఖరం డాక్టర్ కపిలవాయి లింగమూర్తి పెడితే తెలంగాణ రాష్ట్ర సాహితీ వేత్తలను గౌరవించినట్లేనని, తెలంగాణలోని కవులు, కళాకారులు, సాహితీ ప్రియులు, తెలుగు భాషా అభిమానులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని సంఘం నేతలు పేర్కొన్నారు.

ఉస్మానియా దవాఖానను ఉన్న చోటే పునర్నిర్మించండి

ఎమ్మెల్యే రాజాసింగ్

అబిడ్స్, డిసెంబర్17: ఉస్మానియా దవాఖానను గోషామహల్ స్టేడియానికి తరలించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని మార్చుకొని ప్రస్తుతం ఉన్న స్థానంలోనే పునర్నిర్మించాలని గోషామహల్ ఎమ్మెల్యే టి. రాజాసింగ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర శాసన సభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ.. ఉస్మానియా దవాఖానను గోషామహల్ స్టేడియానికి తరలించనున్నట్లు ప్రసార మాధ్యమాల ద్వారా తెలుసుకున్నానని ప్రభుత్వం వెంటనే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని అన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉస్మానియా దవాఖానను అక్కడే నిర్మించేందుకు ప్రయత్న చేయడం జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గోషామహల్ స్టేడియంలో నిర్మించాలని ప్రయత్నించడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే పరిసర ప్రాంతాలలో తీవ్రమైన ట్రాఫిక్ సమస్య ఉండగా ప్రజలు సతమతమవుతున్నారని, ఉస్మానియా దవాఖాన నిర్మాణం జరిగితే ట్రాఫిక్ సమస్య మరింత జటిలమవుతుందని అన్నారు. చాక్నావాడి , చందన్‌వాడి, గోషామహల్ పరిసర ప్రాంతాల ప్రజలు నిరసనలు చేపడుతున్నారని వివరించారు. అంతే కాకుండా గోషామహల్ నియోజకవర్గంలో ఉన్న ఏకైక పోలీస్ మైదానం గోషామహల్ గ్రౌండ్ అని ఇక్కడ శిక్షణ పొందిన అనేక మంది పోలీస్ అధికారులయ్యారని తెలిపారు. దీంతో పాటు స్థానికులు వాకింగ్ చేసుకోవడానికి అనువుగా ఉందని అన్నారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఉస్మానియా దవాఖాన తరలింపు విషయాన్ని పునరాలోచించాలని అసెంబ్లీలో ప్రభుత్వానికి రాజాసింగ్ విజ్ఞప్తి చేశారు.

నెహ్రూనగర్‌లో అయ్యప్పస్వామి మహా పడిపూజ

కాచిగూడ, డిసెంబర్ 17: గోల్నాక డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు, గురుస్వామి భరత్‌రాజ్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో గోల్నాక డివిజన్‌లోని నెహ్రూనగర్‌లో మంగళవారం అయ్యప్పస్వామి మహా పడిపూజ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. గణపతి హోమంతో పూజా కార్యక్రమంతో ప్రారంభమై అయ్యప్పస్వాముల నామస్మరణలతో నెహ్రూనగర్ ప్రాంతమంతా అర్ధరాత్రి వరకు కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గోల్నాక డివిజన్ బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మ, బీఆర్ఎస్ నాయకులు దొర్నాల యాదగిరి, కాలేరు రాజు, డి.రేవతి, అయ్యప్పస్వాములు హాజరై అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు.

ఎరుకల జాతిని ప్రభుత్వం ఆదుకోవాలి

అభివాదం చేస్తున్న ఎరుకల సంఘం నేతలు

రవీంద్రభారతి, డిసెంబర్ 17 : ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎరుకల జాతికి ఇచ్చిన వాగ్దానాలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఎరుకల ప్రజా సమితి రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కెమసారం తిరుపతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ఉపేందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎరుకల జాతిని విస్మరించిందని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎరుకల జాతికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని పేర్కొన్నారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఏకలవ్య విగ్రహం ఏర్పాటు చేయాలని అన్నారు. రేషన్ కార్డు ఉన్న ప్రతి ఎరుకల మహిళలకు రూ.2500 లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

మొదటి ఎరుకల కథా సంపుటి ఆవిష్కరణ

ఏకలవ్య కాలనీ ఎరుకల జీవన గాథలు కథా సంపుటిని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

తెలుగు యూనివర్సిటీ, డి సెంబర్ 17 : వెనకబడిన కులాల సాహితీవేత్తలకు బాలాజి రచించిన ఎరుకల జీవనగాథలు ప్రేరణగా నిలుస్తుందని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుగ్రహీత కె. శివారెడ్డి అన్నారు. పలమనేరు రచయితల సంఘం ఆధ్వర్యంలో ప్రముఖ కవి, నవలా రచయిత పలమనేరు బాలాజి తెలుగు సాహిత్యంలో ఎరుకల జీవనగాథలతో కూడిన ఏకలవ్య కాలనీ కథా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం సాయంత్రం సైఫాబాద్‌లోని స్కైబాబా సాధి బుక్ స్టాల్ ఆవరణలో జరిగింది. కవి, రచయిత, సాహిత్య విమర్శకులు ఎన్. వేణుగోపాల్, సాహితీవేత్తలు ఎ.కె. ప్రభాకర్, ఆర్.కె, ఆర్.రమేశ్, జూపాక సుభద్ర, సుధాకర్, ఛాయ మోహన్, అశోక్, జి. ఉమామహేశ్వర్, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, స్కైబాబా తదితరుల పాల్గొని రచయిత బాలాజి రచనాశైలిని తమ ప్రసంగంలో ప్రశంసించారు.

మద్యం సేవించి వాహనాలను నడిపితే కఠిన చర్యలు

కాచిగూడ, డిసెంబర్ 17: మద్యం సేవించి వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని కాచిగూడ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఎ.శ్రీనివాస్ హెచ్చరించారు. కాచిగూడ ట్రాఫిక్ సీఐ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి తె లంగాణ యువతి మండలి సమీపంలో సిబ్బందితో కలిసి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 10 మంది ద్విచక్ర వాహనదారులు పట్టుబడ్డారు. ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ.. కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకొని వాహనాలు నడపాలని సూచించారు.

రైలు ఢీకొని వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మృతి

కాచిగూడ, డిసెంబర్ 17: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సీహెచ్. సుబ్బారావు కథనం ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి(45)సోమవారం రాత్రి శివరాంపల్లి-బుద్వేల్ రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతిని ఒంటిపై లైట్ పింక్ రంగు చొక్క,గ్రే రంగు ప్యాంట్ ధరించి, ఎత్తు 5.5 ఉన్నటు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శివరాంపల్లి రైల్వేస్టేషన్‌లో..

పట్టాల పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. హెడ్‌కానిస్టేబుల్ సీహెచ్.సుబ్బారావు కథ నం ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి (40) సోమవారం రాత్రి బుద్వేల్-శివరాంపల్లి రైల్వేస్టేషన్‌ల మధ్య పట్టాల పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతిని ఒంటిపై నలుపు రంగు చొక్క, నీలి రంగు జీన్స్ ప్యాంట్ ధరించి, ఎత్తు 5.3 ఉన్నట్లు తెలిపారు. వీరి వివరాలకు 94948 24535 లో సంప్రదించాలి.

మరోవ్యక్తి.. కాచిగూడ రైల్వే హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణాచారి వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి(50)సోమవారం రాత్రి బుద్వేల్-ఉందానగర్ రైల్వేస్టేషన్‌ల మధ్య సోమవారం పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతిని ఒంటిపై తెలుపు రంగు చొక్క, నషం రంగు ప్యాంట్ ధరించి, ఎత్తు 5.6 ఉన్నట్లు తెలిపారు. వివరాల కోసం 8143 807592లో సంప్రదించాలి.

ద్విచక్ర వాహన దొంగ అరెస్టు

అబిడ్స్, డిసెంబర్17 : ద్విచక్ర వాహన దొంగను అబిడ్స్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్స్పెక్టర్ ఇమ్యాన్యుయేల్ తెలిపిన ప్రకారం.. మీర్‌పేట్‌కు చెందిన వాకములు అనే మెట్రో ఉద్యోగి తన బుల్లెట్ వాహనాన్ని గత అక్టోబర్ 29న నాంపల్లిలోని అసెంబ్లీ సమీపంలో నిలిపి వెళ్లగా చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న అబిడ్స్ పోలీసులు ఏసీపీ ఏ. చంద్రశేఖర్ అధ్వర్యంలో డీఐ కె. నర్సింహా తన సిబ్బందితో పాత నేరస్తుడు మహ్మద్ ఖలీల్ అలియాస్ మ్యాడిని అదుపులోకి తీసుకొని విచారించగా ద్విచక్రవాహనాన్ని తానే దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. కాగా నిందితుగు ఖలీల్ పై గతంలో అబిడ్స్ పీఎస్‌లో మూడు, చాదర్‌ఘాట్, షంషాబాద్, లేక్ పోలీస్ స్టేషన్‌లలో ఒక్కో కేసు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఆస్తి పన్ను వసూలు వేగిరం

- గడువు లోపు టార్గెట్‌ను పూర్తి చేసేందుకు అధికారుల చర్యలు

అబిడ్స్‌లోని జీహెచ్ఎంసీ భవనం

అబిడ్స్, డిసెంబర్ 17 : ఆస్తి పన్ను చెల్లింపునకు గడువు తేదీ దగ్గర పడుతుండడంతో జీహెచ్ఎంసీ అధికారులు పన్ను వసూలుకు అనేక చర్యలు తీసుకుంటున్నారు. జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోన్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి నేతృత్వంలో సర్కిల్-14 డిప్యూటీ కమిషనర్ ఎస్ విద్యాధర్ పర్యవేక్షణలో సిబ్బంది భవన యజమానుల వద్ద నుంచి ఆస్తి పన్ను వసూలు చేసేందుకు పాటు పడుతున్నారు. సర్కిల్ కార్యాలయం పరిధిలో అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి పెద్ద మొత్తంలో ఆస్తి పన్ను బకాయి పడిన వారికి డిమాండ్ నోటీసులు జారీ చేయడంతో పాటు వారికి మెసేజ్‌లను పంపి ఆస్తి పన్ను వసూలు చేసేందుకు చర్యలు తీసుకోనున్నారు.

గడువు తేదీ లోపు వసూలుకు చర్యలు..

బకాయి పడిన ఆస్తి పన్నును గడువు తేదీ లోపు వసూలు చేసేందుకు అధికారులు భవన యజమానులపై ఒత్తిడి తీసుకు వస్తున్నారు. ఆస్తి పన్ను వసూలులో ఏవైనా అసమానతలు ఉంటే పరిష్కరించుకునేందుకు ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఫిబ్రవరి మాసం నుంచి మార్చి నెలాఖరు వరకు ప్రతి ఆదివారం ఆస్తి పన్ను పరిష్కార వేదికలను నిర్వహిస్తూ వస్తోంది. ఈ సంవత్సరం కూడా ఆస్తి పన్ను పరిష్కార వేదికలను నిర్వహించేందుకు ఉన్నతాధికారులు నిర్ణయిస్తారని అధికారులు తెలిపారు.

ఆస్తి పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించండి

బకాయి పడిన వారు ఆస్తి పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించండి. ఈ విషయమై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. టార్గెట్ మేరకు ఆస్తి పన్ను వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు ఆన్‌లైన్‌లో కూడా పన్ను చెల్లించేందుకు ముందుకు వస్తున్నారు. బకాయి పడిన వారికి నోటీసులు జీరీ చేస్తున్నాం. గడువు లోపు బకాయిలను వసూలు చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

– ఎస్ విద్యాధర్,
జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్

ప్రేమ్‌నగర్ సైకిల్ దుకాణంలో అగ్నిప్రమాదం

సైకిల్ దుకాణంలో చెలరేగిన మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

గోల్నాక, డిసెంబర్ 17 : అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రేమ్‌నగర్‌లో భారీ అగ్ని ప్రమాదం జరిగింది.. పోలీసులు, ఫైర్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..ప్రేమ్‌నగర్‌లోని ఓ సైకిల్ దుకాణంలో మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఒక్కసారిగా భారీగా మంటలు చెలరేగాయి. దట్టమైన పొగ వ్యాపించడంతో స్థానికులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. కరెంట్ షార్ట్ సర్క్యూట్‌తో ఈ ప్రమాదం జరిగినట్లు ఫైర్ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాదంలో దాదాపు.. రూ.2లక్షల విలువగల సైకిల్లు, టైర్లతో పాటు పలు సామాగ్రి పూర్తిగా దగ్ధమైనట్లు షాపు యజమాని తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ విజయ్ కుమార్‌గౌడ్‌తో పాటు అంబర్ పేట తాసీల్దార్ వీరాబాయి అక్కడికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆపరేషన్ రోప్

ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రధాన రోడ్లపై ఫుట్‌పాత్ ఆక్రమణ తొలగింపు కోసం ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన ఆపరేషన్ రోప్‌ను మంగళవారం సాయంత్రం ఆసిఫ్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించారు. ఇన్స్పెక్టర్ బాల కృష్ణాగౌడ్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆసిఫ్‌నగర్-జిర్రా రోడ్డులో రోప్ ఆపరేషన్‌లో భాగంగా ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను తొలగించారు.

– మెహిదీపట్నం, డిసెంబర్ 17

లంగర్‌హౌస్‌ను అన్నివిధాలా అభివృద్ధి చేస్తాం

ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించడానికి అభివృద్ధి పనులను చేపడుతున్నామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. మంగళవారం లంగర్‌హౌస్ ఆర్యవైశ్య సంఘం నాయకులు మాధుర్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్‌ను కలిసి బాపూనగర్, హా షంనగర్, అంబేద్కర్‌నగర్ బస్తీలలో సమస్యలు విన్నవించారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే అధికారులతోమాట్లాడి అబివృద్ధి పనులను చేపడుతున్నామని పేర్కొన్నారు.

– మెహిదీపట్నం, డిసెంబర్ 17

గొల్ల, కురుమలు అనే సంకరజాతి లేదు

రావుల సుధాకర్

అంబర్‌పేట, డిసెంబర్ 17: గొల్ల కురుమలు అనే సంకరజాతి లేనేలేదని, గొల్ల కురుమల ఐక్యతను దెబ్బతీస్తున్నారని యాదవ సంఘం తెలంగాణ మాజీ అధ్యక్షుడు బద్రీనాథ్ యాదవ్ చేసిన ఆరోపణలు అర్థరహితమని గ్రేటర్ హైదరాబాద్ కురుమ యువత అధ్యక్షుడు రావుల సుధాకర్ అన్నారు. కురుమల మంచితనాన్ని ఆసరా చేసుకుని వారి వాటాను ఎగిరేసుకుపోతున్నది యాదవులని ఆరోపించారు. కురుమలు వేరు, యాదవులు వేరు అన్నది బహిరంగ రహస్యమన్నారు. కురుమల కన్నా జనాభా తక్కువగా ఉన్నా ఆర్థికంగా యాదవులు బలపడుతున్నారని, కురుమల్లో రాజకీయ చైతన్యం తెచ్చి ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం కృషి చేస్తున్నారని తెలిపారు. కురుమలను అడ్డం పెట్టుకొని ఎదుగుతున్న యాదవులు ఇకనైనా తమ తీరును మార్చుకోవాలని హితవు పలికారు. అనేక దశాబ్దాల చరిత్ర చూసిన గొల్ల కురుమలు అనే సంకర జాతి లేనేలేదని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు, ఎమెల్సీ యెగ్గె మల్లేశం కురుమల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. బద్రీనాథ్ నోరు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు.

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వే

మలక్‌పేట, డిసెంబర్ 17 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టి